
సాక్షి ఒడిశా

గురువారం । 7 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.79.569 లు, బంగారం 660 మిల్లీగ్రాములు, వెండి 1 గ్రాములు 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హోం గార్డుల సేవలు అనిర్వచనీయం

విధి నిర్వహణలో హోం గార్డులు అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని పలువురు పేర్కొన్నారు.

- 8లో



అంబేడ్కర్‌కు ఘన నివాళి

బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు.

- 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

రాయగడ: స్థానిక లయన్స్ క్లబ్ సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎప్పటిలాగే పచ్చిక మేసేందుకు అక్కడికి వచ్చిన ఆవు విద్యుత్ స్తంభానికి ఉన్న తీగను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో కొద్ది రోజుల క్రితమే ఆవును రూ.80 వేలకు కొన్నానని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా తన ఆవు మృతి చెందిందని యజమాని పి.రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. దీంతో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ నాయక్ మాట్లాడుతూ.. బాధితుడికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బొగ్గు గనుల రాయల్టీ ఇప్పించండి

- పార్లమెంట్‌లో నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్



పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న ఎంపీ రమేష్ చంద్ర

కొరాపుట్: ఒడిశా రాష్ట్రానికి రావాల్సిన బొగ్గు గనుల రాయల్టీ ఇప్పించాలని నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్‌చంద్ర మజ్జి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బుధవారం ఆయన ప్రసంగించారు. గత 9 ఏళ్లుగా రాష్ట్రం నుంచి బొగ్గును కేంద్రం తీసుకొని వెళ్తోందన్నారు. అందువలన రాయల్టీ విషయంలో గత విధానంలో మార్పులు చేయాలన్నారు. కేంద్రం మార్పులు చేసిన విధంగానైనా ఇవ్వాలని కోరారు. తక్షణం రాష్ట్ర ప్రయోజనాలు నిమిత్తం తమ రాష్ట్రానికి రావాల్సిన రాయల్టీపై వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఆదేశం మేరకు కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషి వివరణ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధానంపై స్పష్టత ఇచ్చారన్నారు. బొగ్గు గనులపై కేంద్రం అమలులోకి తీసుకొచ్చిన విధానం అమలు చేస్తామని తెలియజేశారు. రాష్ట్రానికి రావాల్సిన రాయల్టీతో పాటు ప్రీమియం కూడా అందజేస్తామని సభలో ప్రకటించారు.

అదనపు సీఈవోగా తిరుమల నాయక్



తిరుమల నాయక్

భువనేశ్వర్: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎన్.తిరుమల నాయక్‌ను అదనపు ప్రధాన ఎన్నికల అధికారి (ఏసీఈవో)గా నియమించింది. ఆయన 2009 సంవత్సరపు బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం రాష్ట్ర కార్మిక కమిషనర్, ఒడిశా జీవనోపాధి మిషన్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ప్రజా పాలన విభాగం బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఐఏఎస్ కేడర్‌లో అదనపు కార్యదర్శి హోదాతో కూడిన అధికారాలు, బాధ్యతలతో అదనపు ఏసీఈవోగా నియమించినట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ శర్మకు తెలియజేసినట్లు పేర్కొంది. కాగా కార్మిక శాఖ కమిషనర్‌గా తిరుమల నాయక్ స్థానంలో రాష్ట్ర పాఠశాల విద్యా కార్యక్రమం అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న 2012 సంవత్సరపు బ్యాచ్ ఐఏఎస్ అధికారి అనుపమ్ షా నియమితులయ్యారు. దీంతో ఆయన మో స్కూల్ కార్యక్రమం సభ్య కార్యదర్శిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం నికుంజా బిహారీ ధొలొ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా, మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు శతృఘ్ను కొరొ, మిహిర్ ప్రసాద్ మహంతిలు అదనపు ప్రధాన ఎన్నికల అధికారులుగా ఉన్నారు. ఓఏఎస్ అధికారులు ప్రమోద్ కుమార్ సాహు సంయుక్త సీఈవోగా, లక్ష్మీప్రసాద్ సాహు, పద్మజా దాస్‌లు డిప్యూటీ సీఈవోలుగా ఉన్నారు.



బరంపురం: నగరంలో కురుస్తున్న కుంభవృష్టి



బరంపురం: గొడుగులతో వెళ్తున్న మహిళలు



రాయగడ: ముసురు ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన మార్కెట్ ప్రాంతం

ముంచేసిన మిచాంగ్

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో బుధవారం కురిసిన వర్షాల కారణంగా జన జీవనం అతలాకుతలమైంది. తుఫాన్ తీరం దాటిన నేపథ్యంలో కురిసిన కుంభవృష్టితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నివాస గృహాలు, వ్యాపార ప్రాంతాలు, స్కూళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులపై నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు వర్షానికి వరి పనలు తడిచిపోవడంతో ఈ ఏడాది సైతం నష్టాలు తప్పేలా లేవని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: ప్రేమనగర్ మెయిన్ రోడ్ వర్షపు నీటిలో చిక్కుకున్న ఆటో



బరంపురం: సిటీ హైస్కూల్ రోడ్డులో రోడ్డుపై వర్షపు నీరు



బరంపురం: నీలకంఠనగర్ పాఠశాలలోకి చేరిన నీరు



బరంపురం: గంగాధర్ నగర్‌లోకి చేరిన వరద నీరు



బరంపురం: కబిసూర్యనగర్‌లో తడిచిన వరి పనలు

గోపాల్‌పూర్‌లో ఇండస్ట్రియల్ కారిడార్

- ఒడిశా కేబినెట్ ఆమోదం
- మరో 9 ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్

భువనేశ్వర్:

గోపాల్‌పూర్‌లో ఇండస్ట్రియల్ యుటిలిటీ కారిడార్, కటక్, సంబల్‌పూర్‌లో 2 పారిశ్రామిక ప్లాంట్ల ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో వివిధ శాఖలు సమర్పించిన 10 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేసే ప్రయత్నంలో భాగంగా గంజాం జిల్లా గోపాల్‌పూర్ వద్ద గోపాల్‌పూర్ పోర్ట్, టాటా స్టీల్ ఇండస్ట్రియల్ పార్క్ మధ్య యుటిలిటీ కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఇడ్కో ఆధ్వర్యంలో రూ.128.88 కోట్లతో యుటిలిటీ కారిడార్ ప్రాజెక్ట్ గోపాల్‌పూర్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ప్రస్తుతం ఉన్న వాటితో కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పని చేస్తుంది. కటక్ జిల్లా చౌద్వార్, సంబల్‌పూర్‌లోని నీల్‌గుంగ్రి వద్ద వెల్‌స్పన్ గ్రూప్ ప్రాజెక్ట్‌లకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీని కూడా కేబినెట్ ఆమోదించింది. రూ.6,600 కోట్ల సంయుక్త పెట్టుబడితో ఈ ప్రాజెక్టులు 20,000 మందికి పైగా ఉద్యోగావకాశాలను సృష్టిస్తాయి. వెల్స్పన్ గ్రూప్ చౌద్వార్‌లో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ తయారీ యూనిట్, ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ యూనిట్, నీల్‌గుంగ్రి డీఐ పైపుల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.

ఎంఎస్‌ఎంఈ విధానం సవరణ

ఒడిశా ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి విధానం-22 సవరణకు కేబినెట్ అంగీకరించింది. ఈ సవరణలతో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక ప్రోత్సాహకాన్ని పొందిన ఎంఎస్‌ఎంఈలకు రాష్ట్ర విధానంలో అధిక ప్రోత్సాహకాలను కల్పించడం సాధ్యం అవుతుంది. ఈ సవరణ ద్వారా వ్యవస్థాపకులకు స్టాంప్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ప్రీమియం రీయింబర్స్‌మెంట్‌ను జతచేస్తుంది. దీంతో ఎంఎస్‌ఎంఈలు తమ ప్రాజెక్ట్ అమలును వేగవంతం చేయడంతో పాటు అనంతర రీయింబర్స్‌మెంట్ కోసం సుంకం మరియు ల్యాండ్ కన్వర్షన్ ప్రీమియంను ముందస్తుగా చెల్లించగలుగుతారు. జాప్యం ఆంక్షల తొలగింపు పురస్కరించుకుని గడువు వ్యవధిని మంత్రి మండలి విస్తరించింది. ఈ సర్దుబాటు ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌లో భారీ పెట్టుబడుల్ని సులభతరం చేస్తుంది.

వాహన పన్ను మినహాయింపు

రవాణా రంగంలో మోటారు వాహన పన్ను, పెనాల్టీ బకాయికి ఏక విడత మినహాయింపు, రాయితీ కేబినెట్ ప్రకటించింది. వాహనాలను రద్దు చేసి, రిజిస్ట్రేషన్‌ను తొలగించాలనుకునే యజమానులకు పన్ను, జరిమానా పూర్తిగా మినహాయించేందుకు కేబినెట్ అంగీకరించింది. అదేవిధంగా పన్నును రాయితీ రేటుతో జమ చేయడం ద్వారా తమ రవాణా వ్యాపారాన్ని కొనసాగించాలనుకునే యజమానులకు వాహనం వయస్సు ప్రకారం పన్నులో కొంతభాగంతో పాటు జరిమానా కూడా మినహాయించబడుతుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



లారీ కింద ఇరుక్కున్న బైక్

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి సమీపంలోని లక్ష్మీనగర్ కూడలిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుడు కలహండి జిల్లా తువామూల్ రాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి గరుడపూర్ గ్రామానికి చెందిన గజేంద్ర మాఝి (35), గాయాలైనవారిలో సాయిసురాణి గ్రామానికి చెందిన రమేష్ చెలి(31), సొతం మాఝి(29)లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గజేంద్ర, రమేష్, సొతంలు మంగళవారం బైకుపై రాయగడకు సమీపంలోని జిమిడిపేటలో జరుగుతున్న వసుధ ప్రాజెక్టులో పనిచేసేందుకు తమ గ్రామం నుంచి బయల్దేరారు. ఈ సమయంలో సికరపాయి లక్ష్మీనగర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఢీకొన్నారు. దీంతో బైకు నడుపుతున్న గజేంద్ర సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ సంజయ్ కుమార్ ముర్ము, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన కోణార్క్ ఉత్సవం



కథక్ నృత్యం ప్రదర్శిస్తున్న దృశ్యం



ఒడిస్సీ నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: గత 5 రోజులుగా జరుగుతున్న 34వ కోణార్క్ ఉత్సవం-23 మంగళవారంతో ముగిసింది. ఈ పండగ ఆద్యంతం శాస్త్రీయ సంగీత, నృత్య ప్రదర్శనలు కళాప్రియులను కనువిందు చేశాయి. శీతాకాలపు చలిలో బహిరంగ వేదికపై చివరి రోజున ఒడిస్సీ, కథక్ నృత్య ప్రదర్శనలను తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, ఒడిశా పర్యటన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ లెనిన్ మొహంతి, మాజీ బ్యూరోక్రాట్ అశోక్ త్రిపాఠి, కోణార్క్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ చైర్‌పర్సన్ సంజుక్తా త్రిపాఠి, ఒడిశా సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు గురు అరుణా మహంతి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్థానిక గీత గోవింద చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన కుంకుమ్ మహంతి బృందం మా భవానీ అభినయం ప్రదర్శించింది. మరో నృత్య ప్రదర్శనలో రామాయణ ఇతిహాసంలో భాగం విచిత్ర రామాయణం ఘట్టం ప్రదర్శించారు. కోల్‌కతా ప్రేరణ సెంటర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కు చెందిన లూనా పొద్దార్ బృందం గురు లూనా పొద్దార్ కొరియోగ్రఫీ చేసిన సూర్య జ్యోతి, దర్బారి, రంగ్ వసంత్ మూడు ఒడిస్సీ నృత్యాలను ప్రదర్శించారు.

అరుదైన అనకొండ మృతి

భువనేశ్వర్:

నగర శివారులోని నందన్ కానన్ జూలాజికల్ పార్క్‌లో అరుదైన అనకొండ మృతి చెందింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు జూ అధికారులు ప్రకటించారు. బుధవారం పోస్ట్‌మార్టం కోసం తరలించారు. ఈ నివేదికతో అనకొండ మృతికి ఖచ్చితమైన కారణం తెలుస్తుందని పేర్కొన్నారు. జూలోని మరో అనకొండ సైతం అస్వస్థతకు గురై చికిత్స పొందుతోంది. నందన్ కానన్ జంతు ప్రదర్శన శాల బృందం 2019 అక్టోబర్ 22న చెన్నైలోని మద్రాస్ క్రోకోడైల్ బ్యాంక్ ట్రస్ట్, సెంటర్ ఫర్ హెర్పెటాలజీ (ఎంసీబీటీ) నుంచి ఎనిమిది పసుపు అనకొండలు (నాలుగు మగ, నాలుగు ఆడ), మూడు నైలు మొసళ్లను తీసుకొచ్చారు. పసుపు అనకొండలు దక్షిణ అమెరికాకు చెందిన బోవా జాతికి చెందినవిగా తెలియజేశారు.



అనకొండ

సీఎం అభినందనలు



సీఎం నవీన్‌తో మంత్రి ప్రదీప్ కుమార్ తదితరులు

భువనేశ్వర్: ఐఐటీఎఫ్ – 2023లో స్వర్ణం సాధించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ బృందం కృషిని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందించారు. విభాగం మంత్రి ప్రదీప్ కుమార్ అమత్, ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ సింగ్, డైరెక్టర్ సరోజ్ సామల్‌లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను నవీన్ నివాస్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వాణిజ్య మేళాలో సాధించిన స్వర్ణ బహుమతిని ముఖ్యమంత్రికి చూపించారు. న్యూఢిల్లీలో జరిగిన 14 రోజుల అంతర్జాతీయ ట్రేడ్ కార్నివాల్ ముగింపు సందర్భంగా ఒడిశా మండప్ ఈ అవార్డును అందుకుంది. దీంతో ఈ విభాగం స్ఫూర్తి నిరంతరం కొనసాగించాలని సీఎం పేర్కొన్నారు. కొత్త, మెరుగైన కమ్యూనికేషన్ వ్యూహాలతో రాష్ట్ర ఔట్ రీచ్ కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు. ఐఐటీఎఫ్‌లోని ఒడిశా మండప్ 5 లక్షల మంది సందర్శకులను ఆకర్షించి ప్రత్యేకత చాటుకుంది. ఒడిశా మండప్ కళలు, సంస్కృతి, శిల్ప కళతో పాటు ఒడిశా సముద్ర వాణిజ్య వైభవాన్ని ప్రదర్శించింది. ప్రదర్శన అద్భుతంగా, అందంగా ఉండడంతో విజేతగా నిలిచిందని అధికారులు వివరించారు.

న్యూస్‌రీల్

పంట నష్టం నమోదు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడైనా పంట నష్టం సంభవిస్తే రైతులు వారి స్థానిక రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి వివరాలు తెలియజేయవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. తుఫాను తదనంతర పరిస్థితులపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ముఖ్య అధికారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి నుంచి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగితే రెండు రోజుల్లో నివేదించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా వ్యవసాయాధికారి కే.శ్రీధర్, ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి, కృష్ణమూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సాధికార బస్సుయాత్ర వాయిదా



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గంలో ఈ నెల 10న జరగాల్సిన సామాజిక సాధికార బస్సుయాత్ర వాయిదాపడిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం తెలిపారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టం జరిగిందని, రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉన్నందున యాత్రను వాయిదా వేస్తున్నట్లు అధిష్టానం నుంచి సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. తదుపరి తేదీ తరువాత ప్రకటిస్తామని చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. అంపోలు గ్రామానికి చెందిన కోరాడ లక్ష్మీకి రూ.5లక్షలు, శ్యాంపాలెంకు చెందిన లొద్దు రాధకు రూ.1.5 చెక్కును అందించారు. కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

అనధికారికంగా ఆయుధాలు కలిగిన వారిపై నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, సెబ్ అదనపు ఎస్పీ మణికంఠ

శ్రీకాకుళం క్రైమ్ : అనధికారికంగా ఆయుధాలు కలిగి ఉన్న వారిపై నిఘా పెట్టాలని, పోలీసులు, సెబ్ అధికారులు సమన్వయంతో పనిచేసి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ నిర్వహించి గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ విజయ నాగమణికంఠ పాల్గొన్నారు.

ముద్దాయికి జీవిత ఖైదు, జరిమానా

దత్తిరాజేరు/విజయనగరం క్రైమ్: మండలంలోని విజయరాంపురం గ్రామానికి చెందిన తెంటు ఈశ్వరమ్మను 2022 ఆగస్టు 13న అదే గ్రామానికి చెందిన పోల ఎర్రంనాయుడు సుత్తితో కొట్టడంతో ఆమె మృతి చెందిన ఘటనలో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.ఐదు వందల జరిమానాను జిల్లా కోర్టు విధించింది. ఈ మేరకు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. అప్పట్లో మృతురాలి తల్లి తౌడమ్మ ఫిర్యాదు మేరకు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. భర్త మృతి చెందిన ఈశ్వరమ్మతో సహజీవనం చేసిన ఎర్రంనాయుడు వ్యసనాలకు డబ్బులివ్వలేదని ఈశ్వరమ్మతో గొడవ పడి సుత్తితో కొట్టడంతో చనిపోయిందని ఫిర్యాదులో తల్లి పేర్కొంది. ఈ కేసు విచారణలో సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు ఎర్రంనాయుడిని ముద్దాయిగా నిర్ధారించి తీర్పు చెప్పిందని ఎస్సై వివరించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామ్ వాదనలు వినిపించగా, హెచ్‌సీలు బెడ్సన్, ప్రభాకర్ సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

మేఘ.. సోయగం





పర్లాకిమిడికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మా – సెరంగో ఘాట్ రోడ్డులో తుఫాన్ ప్రభావంతో మేఘాలు కొండలను తాకుతూ కదులుతున్న మనోహర దృశ్యం పర్యాటకులను బుధవారం కనువిందు చేసింది. సాధారణంగా శీతకాలంలో ఊటీని తలపించే ఈ ప్రదేశం వర్షాల ప్రభావంతో మరింత అందంగా ఆకర్షిస్తోంది.

– పర్లాకిమిడి

శ్రామిక్ కాంగ్రెస్ కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

భువనేశ్వర్: ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో సిక్ లైన్ దుస్థితిపై తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ లైన్ నిర్వహణపై రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యం దైనందిన కార్యకలాపాలకు అడ్డంకిగా పరిణమిస్తోందని ఆరోపించింది. బ్రిటిషు కాలం నాటి లైను నిర్వహణ బాధ్యతలను తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ యాంత్రిక శాఖ నిర్వహిస్తోంది. దీంతో సత్వర చర్యలకు ఆదేశించాలని ఓపెన్ లైన్ శాఖ కార్యదర్శి లక్ష్మీధర మహంతి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సీనియర్ ఇంజినీర్ చంద్రబాను నాయక్‌ను కోరింది.

ఏసీ మో బస్సు సేవలు ప్రారంభం



ఏసీ మో బస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీ, కటక్ ప్రాంతాల మధ్య ఏసీ మో బస్సు ఎక్స్‌ప్రెస్ సేవలు బుధవారం ప్రారంభించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ సేవలు లభ్యమవుతాయి. భువనేశ్వర్ నుంచి పూరీ పట్టణానికి రూ.200, కటక్ నగరానికి రూ.100 చార్జీ ప్రకటించారు. నిత్యం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు స్థానిక విమానాశ్రయం నుంచి పూరీ, కటక్ ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ మో బస్సు సేవలు అందుబాటులో ఉంటాయి. కటక్ నుంచి నిత్యం ఉదయం 5.35 గంటల నుంచి, పూరీ నుంచి ఉదయం 9.40 గంటల నుంచి బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎక్స్‌ప్రెస్ మో బస్సుల రవాణా ఆరంభం అవుతుంది. ఈ సౌకర్యంతో విమానాశ్రయం నుంచి పూరీ, కటక్ ప్రాంతాలకు రవాణా వ్యయ భారం గణనీయంగా తగ్గుతుందని నిర్వాహక సంస్థ క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్టు (క్రట్) తెలిపింది. ఈ ప్రాంతాలకు ప్రైవేటు, కార్పొరేటు రవాణా సంస్థలు రూ.1,000 వరకు చార్జీ వసూలు చేస్తున్నాయి.

రైల్వే ఆధునికీకరణ పనులు

భువనేశ్వర్: సౌత్ వెస్టర్న్ రైల్వే పరిధిలో భద్రతకు సంబంధించిన ఆధునికీకరణ పనుల్లో భాగంగా సత్యసాయి ప్రశాంతి నిలయం, బసంపల్లె రైల్వేస్టేషన్ల మధ్య సొరంగం, వంతెనల పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలుని దారి మళ్లిస్తారు. అలాగే హౌరా–సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను పాక్షికంగా రద్దు చేస్తారని రైల్వేశాఖ బుధవారం ప్రకటించింది. 2 నెలల పాటు ఈ ఉత్తర్వులు కొనసాగుతాయి.

ఇన్‌కం టాక్స్ దాడులు..?

రాయగడ:

స్థానిక గాంధీనగర్‌లో నివాసముంటున్న మద్యం వ్యాపారి ఇంట్లో బుధవారం ఇన్‌కం టాక్స్ దాడులు జరిగినట్లు సమాచారం. టాక్స్ చెల్లింపు విషయంలో తప్పుడు సమాచారం ఇస్తూ, టాక్స్ చెల్లించకుండా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలపై ఐదుగురు సభ్యులతో కూడిన బృందం దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. గాంధీనగర్‌లోని అతని ఇంటితో పాటు అదే కాలనీలోని మరో కార్యాలయంపై అధికారులు ఆకస్మిక దాడులను నిర్వహించినట్లు పలువురు పేర్కొంటున్నారు. అత్యంత గోప్యంగా జరుగుతున్న ఈ దాడుల్లో భాగంగా ఎవరినీ లోపలికి అనుమతించకుండా ఇంటి ముందు పూర్తి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని చెబుతున్నారు. కీలకమైన దస్తావేజులు ఇతరత్ర వ్యాపార లావాదేవీలకు సంబంధించిన విలువైన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. ఉదయం ప్రారంభమైన ఈ దాడులు సాయంత్రం వరకు కొనసాగాయి. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారికి సంబంధించిన బంధువుల ఇళ్లతో పాటు కార్యాలయాల్లో ఏకకాలంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే దాడులకు సంబంధించి ఇంతవరకు అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.

ఎమ్మెల్యే వివాహ దరఖాస్తు తిరస్కరణ

భువనేశ్వర్: తిర్తోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దాస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. దరఖాస్తులో తప్పుడు సమాచారం ఉందంటూ ఆయన వివాహ దరఖాస్తును వివాహ రిజిస్ట్రార్ కార్యాలయం తిరస్కరించింది. వివరాల్లోకి వెళ్తే.. కటక్ నగరం అరుణోదయ నగర్‌కు చెందిన ప్రత్యూష నందతో వివాహానికి అనుమతి కోరుతూ ఎమ్మెల్యే రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సెప్టెంబర్ 21న సంప్రదించారు. ప్రత్యూష అవివాహిత అని దరఖాస్తులో పేర్కొన్నాడు. అయితే తర్వాత ఆమె వివాహిత అని, భర్త నుంచి విడాకులు తీసుకున్నట్లు తేలింది. దీనిపై ఎమ్మెల్యే మాజీ ప్రియురాలు సోమాలిక అనే మహిళ ప్రత్యూషకు పెళ్లి అయిందంటూ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. సోమాలికా తన ఆరోపణలకు సంబంధించి కొన్ని సాక్ష్యాలను సమర్పించింది. కాగా ఎమ్మెల్యే బిజయ్ శంకర్ దాస్, సోమాలికా ప్రేమ వ్యవహారం వివాదం ఊగిసలాడుతోంది. లోగడ వీరివురి వివాహం కోసం రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదింపులు జరిపారు. వివాహ తేదీ నాడు ఎమ్మెల్యే గైర్హాజరు కావడంతో అనుమానం బలపడింది. ఈ తరుణంలో మరో మహిళతో వివాహానికి సిద్ధం కావడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. ఆ తర్వాత సోమాలికా అతనిపై అత్యాచారం సహా పలు ఆరోపణలు చేసింది.

సీఎంను కలిసిన సైకత కళాకారులు



సీఎం నవీన్ పట్నాయక్‌తో సైకత శిల్పులు

భువనేశ్వర్: కోణార్క్ ఉత్సవంలో పాల్గొన్న అమెరికా, బెలారస్, రష్యా, శ్రీలంక, జెక్ రిపబ్లిక్, ఆస్ట్రేలియా తదితర అంతర్జాతీయ సైకత కళాకారులు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను నవీన్ నివాస్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. భవిష్యత్‌లో ఎన్నో ఉత్తమ కళా ఖండాలు తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

హోం గార్డుల సేవలు అనిర్వచనీయం



కొరాపుట్: హోం గార్డులతో డీఐజీ చరణ్ సింగ్ మీనా



కొరాపుట్: హోం గార్డుల వందనం స్వీకరిస్తున్న నబరంగ్‌పూర్ ఎస్పీ రోహిత్ శర్మ



పర్లాకిమిడి: గవర్నర్ సందేశాన్ని చదువుతున్న అదనపు ఎస్పీ సునీల్ కుమార్



పర్లాకిమిడి: బెత్తగుడ రిజర్వుడ్ పోలీసు గ్రౌండ్స్‌లో హోంగార్డ్స్

విధి నిర్వహణలో హోం గార్డులు అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని పలువురు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హోం గార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పర్యవేక్షణలో వారి సేవలను కొనియాడారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి పరిస్థితులు ఉన్నా సేవలందిస్తారని పేర్కొన్నారు. వారి సేవలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వారికి పతకాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: హోం గార్డులకు పురస్కారాలు అందజేస్తున్న డీఐజీ సత్యబ్రత బోయి, ఎస్పీ సర్వాణ్ వివేక్



బరంపురం: ఛత్రపూర్‌లో హోంగార్డు దినోత్సవ వేడుకలు



మల్కన్‌గిరి: మాట్లాడుతున్న ఎస్పీ నితీష్ వాద్వానీ



మల్కన్‌గిరి: ఎస్పీ కార్యాలయంలో హోంగార్డు దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అంబేడ్కర్‌కు ఘన నివాళి



భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ



భువనేశ్వర్: ఖుర్దారోడ్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్ఎం హెచ్.ఎస్.బాజ్వా



బరంపురం: కాంగ్రెస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: లంజిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీడీఏ చైర్మన్ సుభాష్ తదితరులు

నివాళులు

శ్రీకాకుళం: నవభారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అస్తమించని సూరీడని, ఆయన రూపొందించిన రాజ్యాంగం ఆదర్శనీయమని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా దళిత, బహుజన సంఘాల నాయకులతో కలసి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణానికి అంబేడ్కర్ కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు డాక్టర్ కంఠవేణు, తైక్వాండో శ్రీను, యజ్జల గురుమూర్తి, పోతల దుర్గారావు, ఎ.ప్రతాప్, సీర రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సుజాత తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

క్లుప్తంగా

సాయుధ దళాల దినోత్సవానికి విరాళాల సేకరణ



విరాళాలను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: సాయుధ దళాల పతాక నిధికి విరాళాలను సేకరిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆయన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సైనికులు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ పోరాటంలో, బొంబాయ్ తాజ్ హోటల్ దురాక్రమణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మన సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తోందన్నారు. సాహసోపేత వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఏడాది డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ విరాళాలను జిల్లా సైనిక సంక్షేమాధికారి విజయనగరం పేరున ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ 52065221666, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020931, ఎంఐసీఆర్ 535002017 నందు డిపాజిట్ చేయాలని కోరారు. ఎన్‌సీసీ విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వచ్చి విరాళాలు సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలిన పెంకుటిళ్లు

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు దత్తిరాజేరు మండలంలోని గొభ్యాం గ్రామంలో రెండు పెంకుటిళ్లు కూలిపోయినట్లు వీఆర్వో అప్పలనాయుడు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన వంగపండు మహేష్, వంగపండు పోలమ్మలకు చెందిన ఇళ్లు కూలిపోయాయని, ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని ఇంటిలో ఉన్న వంట సామగ్రి ధ్వంసమైందని చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పశువుల పాక కూలి ఆవు మృతి



చనిపోయిన ఆవును పరిశీలిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు, మండల పశువైద్యాధికారి రామరాజు

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గడిచిన మూడు రోజుల విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో భోగాపురం మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పాడిరైతు బైరెడ్డి పెంటయ్య తనకున్న ఆవులను పాకలో కట్టాడు. అయితే బుధవారం ఉదయం భారీగా వర్షం కురవడంతో పశువుల పాక కూలి ఒక ఆవు మృతిచెందింది. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ చింత బంగార్రాజు, మండల పశు వైద్యాధికారి రామరాజు సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించి, ప్రమాదానికి గల కారణాలను బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. నష్ట పరిహారం నిమిత్తం రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వర్తకుడి నిజాయితీ

- బంగారు లాకెట్ అప్పగింత

సింహాచలం : భక్తురాలు పోగొట్టుకున్న నాలుగున్నర తులాల బంగారు లాకెట్‌ని తిరిగిచ్చి సింహగిరికి చెందిన వర్తకుడు నిజాయతీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న తెర్ల వెంకటరత్నం బొబ్బిలిలోని వెలమపేటలో నివసిస్తున్నారు. ఈ నెల 5న మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం వెంకటరత్నం తన సోదరి వరలక్ష్మితో కలిసి సింహగిరి మార్కెట్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు పలు దుకాణాలు తిరిగారు. ఈ తరుణంలోనే ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు లాకెట్‌ని వెంకటరత్నం పోగొట్టుకుంది. తిరుగు ప్రయాణంలో తగరపువలస వరకు వెళ్లాక... బంగారు లాకెట్ కనిపించకపోవడంతో హుటాహుటిన రాత్రి 8 గంటల సమయంలో మళ్లీ సింహగిరికి వచ్చా రు. వారు తిరిగిన దుకాణాల వదకు వెళ్లి వర్తకులకు విషయాన్ని తెలియజేశారు. లాకెట్ దొరికితే ఇప్పించాల్సిందిగా ఫోన్ నంబర్ ఇచ్చారు. షాప్ నంబర్ – 2 వర్తకుడు మదన్ వద్ద పనిచేస్తున్న నాయుడు, రోజాకి లాకెట్ దొరకడంతో వెంటనే మదన్‌కి ఆ వస్తువు అప్పగించారు. వెంటనే వెంకటరత్నానికి వర్తకుడు మదన్ ఫోన్ చేసి విషయం తెలియజేశారు. సింహగిరిపై పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, కోశాధికారి దొంతల శంకర్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పైడిరాజు సమక్షంలో బుధవారం గొలుసును మదన్ అందజేశారు.

అకాలవర్షాలతో అంటువ్యాధులు

- వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- నీరు నిల్వతో వ్యాధుల వ్యాప్తి
- తీరప్రాంతంలో వైద్య శిబిరాల ఏర్పాటు డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



కోనాడలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళకు బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వర్షపు నీరు కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉంది. అదే విధంగా తాగునీరు కలుషతమయ్యే ఆస్కారం ఉంది. దీనివల్ల అంటు వ్యాధులు ప్రబలే దుస్థితి ఉంది. ఇటువంటి సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి వైద్యాధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వైద్యాధికారులు చర్యలు చేపడుతున్నారు.

డయేరియా, టైఫాయిడ్ ప్రబలే ఆస్కారం

ఇళ్లముందు, వీధుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. వర్షపు నీరు తాగునీటి వనరుల్లో చేరడం వల్ల నీరు కలుషితమయ్యే పరిస్థితి ఉంది. అటువంటి నీటిని తాగడం వల్ల డయేరియా, టైఫాయిడ్ వ్యాప్తి చెందవచ్చు. అదేవిధంగా వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి అధికమవుతుంది. అవికుట్టడం వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముంది. అందువల్ల ఇంటి పరిసరాల్లోను వీధుల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

చర్యలు చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ

తుఫాన్ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 8 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. 24 గంటల పాటు అందుబాటులో ఉండేవిధంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. వైద్య శిబిరాల వద్ద అంటువ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచారు. వారం రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న గర్భిణులను సీహెచ్‌సీలో చేర్పించారు.

పీహెచ్‌సీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసిన నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉన్నందున పీహెచ్‌సీల సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా వ్యాధులు వ్యాప్తి చెందినట్లయితే తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి వనరుల్లో వర్షపు నీరు చేరినందున వాటర్ టెస్టింగ్ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లను డీఎంహెచ్‌ఓ భాస్కర రావు ఆదేశించారు.



కొత్తూరులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు వైద్యసిబ్బందిని ఆదేశించారు. తుఫాన్ అనంతర పరిస్థితుల పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ముందస్తు చర్యలు ఏ మేరకు చేపట్టారో ఆరా తీశారు. అత్యవసర మందులు యాంటీ స్నేక్ వీనం, ల్యాబ్‌లు, వ్యాక్సిన్ నిల్వలు, ప్రసూతి గదిని పరిశీలించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్, బ్యాటరీ పనితీరును పరిశీలించారు. ఓపీ నిర్వహణ రికార్డుల్లో నమోదైన రోగుల ఆరోగ్య వివరాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, డయేరియా, అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో క్లోరినేషన్, శానిటేషన్ పక్కాగా జరగాలని చెప్పారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి ప్రగతి నివేదికలో పురోగతి సాధించాలని సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు జరగాలని, పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని ఈనెల 11 నుంచి నిర్వహించనున్న మిషన్ ఇంద్రధనుస్సు టీకా కార్యక్రమానికి సూచించిన మార్గదర్శకాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. క్షయ వ్యాధి గ్రస్తులకు నెలనెలా చికిత్స, పర్యవేక్షణ ఉండాలని, చికిత్స కాలం వరకు రోగులకు ప్రతి నెలా పౌష్టికాహారానికి ప్రభుత్వం రూ.500 చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనూష, సూపర్‌వైజర్లు, వెంకటనాయుడు, శంకరరావులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



వర్షాలు అధికంగా కురవడం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా నూరుశాతం నీటి ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు. అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈగలు, దోమలు వాలే ఆహార పదార్థాలను తినకూడదు. ఇటువంటి వి తినడం వల్ల జిగట విరోచనాలయ్యే ప్రమాదం ఉంది. వారం రోజుల్లో ప్రసవించే అవకాశమున్న గర్భిణులను సీహెచ్‌సీలకు తరలించాం. వైద్య శిబిరాల్లో మందులు సిద్ధంగా ఉంచాం.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

18, 19న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ 31 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం వారు మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక సుందరయ్యభవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంఘం ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ 31 వ జిల్లా మహాసభలు డిసెంబర్ 18, 19 తేదిలలో పాలకొండ పట్టణంలో నిర్వహిస్తామన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాలు వాటి ఫలితాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ విద్యాభివృద్ధికి దోహదపడే విధంగా ఈ వేదిక జరగనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యారంగం అధోగతిపాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగం సమగ్రమైన విద్యాభివృద్ధితో ముందుకు పోవాలని, అటువంటి అభివృద్ధిలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కృషి చేస్తుందని, భవిష్యత్తు ఉద్యమాలను, నిర్మాణాలను ఉధృతంగా చేపట్టేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మహాసభల్లో జిల్లా నలుమూలల నుంచి 200 మంది ప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం పాల్గొనున్నారని, 18 న పాలకొండ పట్టణంలో ప్రదర్శన, 19 న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజు, కమిటీ సభ్యులు శివ, శారద, శ్రావణి, ఇందు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హోంగార్డ్స్ సేవలు కీలకం



హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

- ఘనంగా 61వ ఆవిర్భావ దినోత్సవం
- పోలీస్‌శాఖకు చేస్తున్న సేవలను ప్రశంసించిన జిల్లా అదనపు ఎస్పీ

విజయనగరం క్రైమ్: పోలీస్ వ్యవస్థలో హోంగార్డ్స్ ఒక భాగమై పోలీసులు నిర్వహించే అన్ని రకాల విధులను నిర్వహిస్తూ, జిల్లా పోలీసుశాఖలో కీలకంగా పనిచేస్తున్నారని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. 61వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీ దేవీ దండుమారమ్మ కల్యాణ మంటపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే బందోబస్తు, ముఖ్య వ్యక్తుల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ , వివిధ విభాగాల్లో హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అంతేకాకుండా పోలీసు ఉద్యోగుల్లా హోంగార్డ్స్ కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, కంప్యూటర్ ఆపరేటర్లుగా , డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. హోంగార్డులు నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని, తద్వారా రాష్ట్ర పోలీసుశాఖకు కూడా మంచి కీర్తిని తీసుకువచ్చే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణ నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సివచ్చినప్పుడు ఒక మంచి అవకాశం లభించిందన్న నూతనోత్సాహంతో పనిచేయాలని హితవు పలికారు. హోంగార్డ్స్ సంక్షేమానికి జిల్లా ఎస్పీ, తాను కట్టుబడి ఉన్నామని, ఏ అవసరం వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిభ ఉంటే ఏ స్థాయిలో పనిచేసినా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కిందిస్థాయి వ్యక్తులమన్న నిరాశ అవసరం లేదని, తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే, తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్ మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే ఏ రకమైన విధులనైనా హోంగార్డ్స్ నిర్వహించగలరన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డ్స్‌కు ప్రశంసపత్రాలు, జ్ఞాపికలను అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ బహుకరించారు. హోంగార్డ్స్ పరేడ్ కమాండర్‌గా ఎం.శివ సంతోష్ వ్యవహరించారు. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా అదనపు ఎస్పీ పావురాన్ని ఎగురవేసి, ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, వీరకుమార్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డులకు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందజేస్తున్న అదనపు ఎస్పీ

స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, నివేదికలను తనకు అందజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరావును కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ చేయించుకున్న ప్రతి ఒక్కరి వివరాలను తెప్పించుకుని, వాటిని పరిశీలించాలని చెప్పారు. గర్భస్థ లింగ నిర్ధారణ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియం చట్టం 1994 అమలుపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం బుధవారం సాయంత్రం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి స్కానింగ్ సెంటర్ల తనిఖీలు, నివేదికల పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోగ్రాం అధికారులకు నిర్ణీత గడువు విధించి, తమ పరిధిలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయించాలని ఆదేశించారు. స్కానింగ్ చేయించుకున్న ప్రతి ఒక్కరికి బిల్లు ఇచ్చే విధంగా చూడాలని, రిజిస్టర్లను పరిశీలించాలని చెప్పారు. గర్భస్థ లింగ నిర్ధారణ వెల్లడి నేరమన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీఐఓ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటేశ్వరావు, దిశ డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, పీపీ జయలక్ష్మి, నేచర్ సంస్థ కో ఆర్డినేటర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గెస్ట్ లెక్చరర్స్‌ను నియమించాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఐటీఐ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్స్‌ను నియమించి తరగతులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. పోస్టుల ఖాళీల వల్ల ఏ సబ్జెక్టులో కూడా ఉపాధ్యాయులు లేకుండా ఉండకూడదని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి మంజూరు కావలసిన పనులు, రావలసిన నిధుల కోసం ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలన్నారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో గుర్తించిన లోపాలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘం నుంచి కలెక్టర్‌కు వినతి ప్రత్రం అందజేశారు. ఈ మేరకు ఆయా కళాశాలల ఉన్నతాధికారులతో బుధవారం ఆమె తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈఓ బి.లింగేశ్వర రెడ్డి, జిల్లా బీసీవెల్ఫేర్ అధికారి కె.సందీప్ కుమార్, డీవీఈఓ భీమ శంకరరావు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్, సోషల్ వేల్ఫేర్ అధికారి రామానందం, ప్రభుత్వ ఐటీఐ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏ ఒక్క రైతూ నష్టపోకూడదు

- పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపడతాం: కలెక్టర్ నాగలక్ష్మి



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: తుపాను ప్రభావం వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, వారికి అండగా నిలుస్తుందనే భరోసాను కల్పించాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో బుధవారం మాట్లాడారు. పంటపొలాల్లో నీరు తొలగించే ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ప్రకృతి వైపరీత్యాల యాజమాన్యం సంస్థ డీపీఎం ఎం.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీ తర్వాత పంట నష్టాల అంచనా

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మీడియాతో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడారు. జిల్లాలో బుధవారం రాత్రికి వర్షం పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, వర్షం తగ్గిన వెంటనే ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వరి పంటను కాపాడేందుకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు. సుమారు 1,500 ఎకరాల్లో పంట కోతలు కోసి వదిలిపెట్టారని, పొలాల్లో ఉన్న వరి పంటను కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపడతామన్నారు. మరో 400 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటను కాపాడే ప్రయత్నం చేస్తామని చెప్పారు. పంట పొలాల్లో వర్షపు నీరు తగ్గిన తర్వాత డిసెంబర్ 9 నుంచి పంట నష్టాలపై అంచనావేసే కార్యక్రమం చేపడతామన్నారు.

మరో మూడురోజులే గడువు

విజయనగరం అర్బన్: ఓటరు నమోదు దర ఖాస్తు చేసుకునేందుకు మరో మూడు రోజులే గడువు ఉందని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్పేందుకు కృషిచేయాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు కోసం ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో సుమారు 17 వందల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసిన వారిలో 18, 19 సంవత్సరాలు దాటిన వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కొంత మంది ఆన్‌లైన్‌లో కూడా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారని, సుమారు 5,600 ఆన్‌లైన్ దరఖాస్తులను ఇంకా పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఫొటోల్లో తప్పులు, పేర్లలో తప్పులను కూడా సవరిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఈఆర్‌ఓలు ఎం.వి. సూర్యకళ, వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, నూకరాజు, ఎన్నిల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, సిబ్బందితో పాటు వివిధ రాజీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, కుటుంబ రావు, రమేష్‌కుమార్, సోములు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆరోగ్య భరోసా



ఈ తరహా మూగజీవాలకు ఆరోగ్య రక్షణ

- పాడిపశువులకు హెల్త్ కార్డులు
- ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు పంపిణీ

పాలకొండ రూరల్: వ్యవసాయంతో సమానంగా పాడి రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం పశువుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక హెల్త్ కార్డులు అందజేస్తోంది. వ్యవసాయ ఆధారితమైన పార్వతీపురం మన్యం జిల్లాలో సాధారణ రైతులతో పాటు గిరిజన రైతులు ప్రస్తుతం పాడిరంగంపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో పశుసంవర్ధక శాఖ నేతృత్వంలో మూగజీవాల రక్షణకు సర్కారు పెద్దపీట వేసింది. పశునష్టపరిహార పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి మరణించిన పశువులకు పరిహారం చెల్లించనుంది. డాక్టర్ వైఎస్సార్ పశు బీమా ద్వారా అన్ని రకాల జీవాలు, పశువులకు బీమా చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. పాడి సందప కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి యానిమల్ హెల్త్ కార్డు అందించేలా యంత్రాంగం ప్రణాళికతో ముందుకు వెళ్తోందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కార్డులో వివరాల నమోదు

పశువులు, జీవాలకు వేసే వ్యాధినిరోధక టీకా, నట్టల నివారణ మందుల వివరాలు ఈ హెల్త్ కార్డుల్లో నమోదు చేస్తారు. వైఎస్సార్ పశు బీమా పథక వివరాలను, సంబంధిత పశు సంవర్థక శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ఈ కార్డుల్లో పేర్కొంటారు. అత్యవసర అనారోగ్య పరిస్థితిలో వైద్యులను సంప్రదించేందుకు టోల్ ఫ్రీ నంబర్లు ఇందులో ఉంటాయి. పెద్ద పశువులు, జీవాలకు వేరువేరుగా కార్డులు అందించడంతో పాటు వాటి పూర్తి వివరాలు నమోదు చేస్తారు. వాటికి అందిస్తున్న వైద్య సేవలు, వాడుతున్న మందుల వివరాలు యానిమల్ హెల్త్ కార్డుల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

కార్డుల జారీ ఇలా..

పశుగణన అధారంగా జిల్లాలో ఆవులు 2,28,681, గేదెలు 46,017, గొర్రెలు 1,73,110, మేకలు 2,07,451, పందులు 5089, కోళ్లు 8,46,060 ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. వాటిని కలిగి ఉన్న 56 వేల 908 కుటుంబాలకు యానిమల్ హెల్త్ కార్డులు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆరు పెద్ద పశువులకు ఒక హెల్త్ కార్డు జారీ చేస్తారు. ఈ నేపథ్యంలో 15 పశువులు కలిగి ఉంటే మూడు కార్డులు అందిస్తారు. 20 గొర్రెలు, మేకలకు ఒక కార్డు వంతున అందించేలా చర్యలు చేపట్టారు. యానిమల్ హెల్త్ కార్డు ఆవశ్యకతపై వైద్యులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. 6 నెలలు ఆపై వయసు కలిగిన గొర్రెలు, మేకలను సాకుతూ రైస్ కార్డు ఉన్న పాడిరైతు కుటుంబానికి 80 శాతం రాయితీతో బీమా అందించనున్నారు. మృతి చెందిన ఒక్కో జీవానికి రూ.6వేలు నష్ట పరిహారం చెల్లిస్తారు. ఒకటిన్నర ఏడాది వయసు పైబడిన మేలుజాతి పశువులకు ఒక్కోదానికి రూ.30వేలు, రెండు సంవత్సరాలు పైబడిన పశువులకు రూ.15వేలు పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పాడి రైతులకు ఎంతో మేలు



యానిమల్ హెల్త్ కార్డులతో పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఒక కుటుంబంలో రెండు పశువులు ఉన్నా కార్డు మంజూరు చేస్తాం. క్షేత్రస్థాయిలో మా సిబ్బంది అర్హులైన పాడి పెంపకందారులను గుర్తించి వారి ఆధార్ కార్డును అనుసంధానం చేసి హెల్త్ కార్డులు అందిస్తారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగనుంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా కార్డులు అందించేలా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకూ 236 ఆర్‌బీకేల పరిధిలో 56వేలకుపైబడి పాడి రైతు కుటుంబాలను గుర్తించాం. 7,631 కుటుంబాలకు చెందిన 10,643 మందికి పాడిరైతులకు హెల్త్ కార్డులు అందించాం.

ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు, పాలకొండ